క్లుప్తంగా

138 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

కుత్బుల్లాపూర్: పేదింటి ఆడబిడ్డల వివాహానికి తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 138 మంది లబ్ధిదారులకు రూ. 1,38,16,008 విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కమలాకర్, మఖ్సూద్ అలీ, గౌసుద్దీన్, సిద్దిక్, శ్రీశైలం, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శనివారం డి.పోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

◆ దుర్గాకాలనీ, డి.పోచంపల్లి గ్రామం, మాధవరావు కాలనీ, హనుమాన్ దేవాలయం, శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు...

◆ 60ఫీట్స్ రోడ్డు, గాయత్రీనగర్, వివేకానంద నగర్, హోలీచైల్డ్ స్కూల్, ఇందిరానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఏసీటైర్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో..

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల నేపథ్యలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఏసీటైర్, మల్లంపేట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బాచుపల్లి చౌరస్తా నుంచి శ్రీకర విల్లాస్ ప్రధాన రోడ్డు, దేవీ హోమ్స్, మమత ఆస్పత్రి నుండి బాచుపల్లి సిగ్నల్స్, రెయిన్‌బో కాలనీ, కేఆర్‌సీఆర్ కాలనీలోని రోడ్డు నం. 1 - 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కాటికాపరుల కులవృత్తిని కాపాడాలి

సుభాష్‌నగర్: కాటికాపరుల కులవృత్తిని కాపాడాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాటికాపరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ.. హిందూ శ్మశానవాటికలను అభివృద్ధి పరుస్తున్న అధికారులు కాటికాపరుల సంక్షేమాన్ని మరిచారని అన్నారు. వాటిలో పనిచేసే కాటికాపరుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కులవృత్తిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. జీతయ్య, రవి, నగేష్, స్వామి, కృష్ణ, బాలకృష్ణ సురేందర్, లింగమ్మ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



దేవేందర్‌నగర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అణగారిన వర్గాలకు స్వేచ్ఛను, రాజ్యాధికారాన్ని ఇచ్చిన మహోన్నత వ్యక్తి సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సర్వాయి పాపాన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా మహా సైన్యాన్ని రూపొందించి పేద ప్రజలకు స్వేచ్ఛను కల్పించిన సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌడ సంఘం కమిటీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

◆ కొంపల్లిలోని కల్లు దుకాణం ప్రాంగణంలో మున్సిపల్ కౌన్సిలర్ శ్రీవిద్య ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కౌన్సిలర్లు మంజులా కుమార్‌గౌడ్ , పూజారి వసంత, లక్ష్మణ్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ భగత్ సింగ్‌నగర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండల శ్రీనాథ్‌రావు, కామ్రేడ్ బి.సత్యం ముఖ్య అతిథులుగా హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు. గౌడ సంఘం సభ్యులు బిక్షపతిగౌడ్, బీసు వెంకటేశంగౌడ్, రమేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, వెంకటేష్ గౌడ్, ప్రవీణ్ కుమార్‌గౌడ్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం చౌరస్తాలో గౌడ సంఘం నాయకులు పాపన్న జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూడా అంతయ్యగౌడ్, కూన రాఘవేందర్ గౌడ్, రవీందర్ గౌడ్, రాజలింగంగౌడ్, వెంకటేష్ గౌడ్, బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొంపల్లిలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

బ్రిటీషర్లను వణికించిన యోధుడు నేతాజీ



శ్రీదుర్గా వెల్ఫేర్ సొసైటీలో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహేష్‌పటేల్

సుభాష్‌నగర్: ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటీషర్లకు వెన్నులో వణుకు పుట్టించిన మహానేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని దుర్గ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పూజారి మహేష్ పటేల్ అన్నారు. శుక్రవారం నేతాజీ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీదుర్గ వెల్ఫేర్ సొసైటీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమములో కొంపల్లి వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, సొసైటీ సభ్యులు శ్రీను, కిరణ్ కుమార్, నవీన్ కుమార్ లు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డులో కార్డన్ సెర్చ్

సూరారం: సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూరారం మార్కెట్ రోడ్డులో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అడిషనల్ డీసీపీ బాల్‌సిద్ధిఖ్, మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డిల నేతృత్వంలో పేట్ బషీరాబాద్, సూరారం, దుండిగల్, మేడ్చల్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే సరైన పత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను సీజ్ చేశారు. అలాగే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ముగ్గురుపై కేసు నమోదు చేసి మద్యం సీసాలపు స్వాధీనం చేసుకున్నారు.



ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు సమస్యలు తెలుపుతున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: అధికారులు ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ముందుకు సాగాలని, ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులపై వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని సమస్యలను ఏకరవు పెట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిశీలించి వాటికి తగిన పరిష్కారాన్ని చూపాలని సూచించారు. దుండిగల్, కొంపల్లి, నిజాంపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తప్పకుండా బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

నిజాంపేట్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని, ప్రగతినగర్‌లోని శ్రీమంకీస్ చౌరస్తాలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో పేదలు డబుల్‌బెడ్‌రూమ్‌లకు దరఖాస్తు చేసుకున్నారని.. వెరిఫికేషన్ పూర్తి చేసి వెంటనే ఇళ్లను కేటాయించాలన్నారు. కూలీనాలి చేసుకుని జీవించే పేదలకు ఇళ్ల అద్దెలు చెల్లించడం పెనుభారంగా మారిందన్నారు. ఇళ్ల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల వెంకటేశ్వరరావు, బాలపీరు, వెంకటరాజ్యం, మల్లికార్జున్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస తొలి శుక్రవార పూజలు



కుత్బుల్లాపూర్: శ్రావణమాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. గాజులరామారం చిత్తరమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, నక్షత్ర హారతి, సామూహిక కుంకుమార్చన చేశారు. అదే విధంగా వేష్ణవి ఎన్‌క్లేవ్‌లోని శ్రీరేణుక ఎలమ్మ, ఏపీహెచ్‌బీ కాలనీలోని శ్రీదుర్గామాత ఆలయంలో అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

చింతల్: చింతల్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత కేఎం ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు నక్క ప్రకాష్, కృష్ణ, రామ్ చందర్, పోతరాజ్ రాజేందర్, ఏనుగుల బాలకృష్ణ, ఊరడి మల్లికార్జున్, శాతూరు మహేష్, పోతరాజు మహేందర్‌కుమార్, రామకృష్ణ, మోహన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



సెల్లార్ నీళ్లు.. రోడ్డుపై వదులుతూ!

• స్థానికులకు తప్పని ఇబ్బందులు • ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్: ఓ బిల్డర్ బరితెగింపుతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అపర్ణ, వైష్ణవి విల్లాల సమీపంలో ఉన్న ఓ బహుళ అంతస్తు నిర్మాణదారుడు వర్షం పడ్డ.. పడకపోయినా.. సెల్లార్‌లో ఉన్న నీటిని రోడ్డు మీద వదులుతూ రావడంతో.. అటువైపుగా వచ్చిపోయే వాహనాలు వెళ్లకుండా రోడ్డంతా అధ్వానంగా మారిపోయింది. ఇదేమని ప్రశ్నిస్తే మీకేమైందంటూ.. అక్కడ ఉన్న సెక్యూరిటీ సమాధానం ఇస్తున్నాడు. ప్రధాన రోడ్డుపై నిత్యం ఇలా సెల్లార్‌లో ఉన్న నీటిని తోడుతూ రోడ్డు మొత్తం నడవడానికి వీలు లేకుండా చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఇటీవల స్థానిక కాలనీవాసులు గ్రేటర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు బిల్డర్‌పై రోడ్డుపై నీళ్ల వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశ్రామికవేత్తలుగా విద్యార్థులు తయారవ్వాలి

దుండిగల్: విద్యార్థులు భవిష్యత్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారై ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఎదగాలని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఇనోవేషన్ కార్యక్రమం శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఏ సంస్థ స్థాపించినా ముందుగా మార్కెటింగ్, కమ్యునికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, డీన్ రాధికాదేవి, హెచ్ఓడీలు బలరాం, భాస్కర్, శిరీష, సాయికృష్ణ శుభాంగిరావు, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.